

# "చెయ్యి విరిగిన దేవుడు"

## చిగురుపాటి స్ఫూర్తి

ఇంటికెళ్ళేసరికి—."విస్సూ లెటర్ వ్రాసాడు" అంటూ టీతో పాటు లెటర్ అందించింది నా శ్రీమతి ఉష.

ప్రియమైన
రఘు!

చాలకాలం తరువాత ఈ ఉత్తరం ఏమిటను కుంటున్నావా? నిజానికి ఇది ఉత్తరం కాదు, ఆహ్వాన పత్రం. ఈ సంవత్సరం పాలెంలో అమ్మవారి ఉత్సవాలు మరింత ఘనంగా జరుగుతాయి. కాబట్టే కుటుంబ సమేతంగా బయల్దేరు. నలపాయ్, అచ్యుతం రేపే వచ్చేస్తున్నారు. పది రోజులు ఇక్కడుండటానికి చిత్తూ కుటుంబ సమేతంగా రెండ్రోజుల్లో దిగుతున్నాడు. నువ్వూ తప్పకుండా వస్తే పాత మిత్రులమంతా కలసి నట్టౌంటుంది. వస్తావని ఆశిస్తున్నాను. "విస్సూ"

"చదువు" అన్నాను ఉషకిచ్చి. ఆమె చదవటం పూర్తిచేసి "వెళ్దామా!" అంది. ఆ అడగటంలో వెళ్దామన్న సూచన కూడా ఉంది.

నా ప్రమోషన్ విషయంలో ఆఫీసులో గొడవగా ఉంది. అంతా రాజకీయాలు. చికాగ్గా ఉంది. మిత్రులని కలిసినట్టు ఉంటుంది. కొన్నాళ్ళు రిలాక్సయినట్లు ఉంటుందనుకొని తిమ్మాయ్‌పాలెం వెళ్ళటానికి నిర్ణయించుకొన్నాను.

రైలు గమనంతో పాటు చిన్న నాటి జ్ఞాపకాలు కూడా వేగంగా అందుకొన్నాయి. ఆ రోజులు ఎంత అందమయినవి. ఎంతో ఉత్సాహంగా ఉండే వాళ్ళం. ఆ ఉత్సాహం అంతా ఇప్పుడేమయ్యిందో ననిపిస్తుంది. "పెద్ద వాళ్ళం అయిపోయాం రా" అంటే వయస్సు శరీరానికి కాని మనస్సుకు కాదు. ఆరు ఋతువులు ఆగక సాగే ఆనంద స్పందనం జీవితం" అంటాడు చైతన్య.

అవును చైతన్య పేరుకు తగ్గట్టు నిత్య చైతన్యంతో ఉంటాడు. ఒక మనిషిని ప్రేమించటం ద్వేషించటం ఏక కాలంలో జరగటం అసంభవం అని ఎవరైనా అంటే కాదనలేం కానీ చిత్తూ విషయం వేరు. వాడ్ని ప్రేమించటం గాని ఇష్టపడటం గాని మన చేతిలో లేదు. అది వాడి స్వభావంలోనే ఉంది. అలాగే అతని తార్కిక జ్ఞానానికి అతని పట్ల అసూయ.... అతని ముందు తాము తగ్గిపోతున్న భావన కలగటంతో అతని పట్ల ద్వేషం కలగక మానదు, మనం మామూలు మనుషులం కాబట్టే.

అమ్మవారి ఉత్సవాలు నా చిన్నప్పుడు లేవు. వినాయక చవితికి, శ్రీరామ నవమికి కుర్రకారు గొడవ తప్ప తిమ్మాయి పాలెంలో ఉత్సవాలు లేవు. విస్సూ పూర్వం ఎప్పుడో రాసిన ఉత్తరంలో సమాచారం మళ్ళీ మదిలో మెదిలింది.

హఠాత్తుగా చిన్న రాయుడు చేలో అమ్మవారి విగ్రహం వెలిసింది. అదీ ముందుగా పూజారి అల్లుడికి కలలో కనిపించి తాను అవతరించబోతున్నానని చెప్పి మరీ వెలిసింది అమ్మవారు.

రాయుడు చేలోనే గుడికట్టారు. ప్రతి సంవత్సరం ఉత్సవాలు, మొక్కులు సాగుతున్నాయి. చాలా మహత్యం ఉన్న విగ్రహం చాలా మంది కోర్కెలు తీరుస్తుంది.

ఆ విగ్రహం మహత్యం వలనే చిన రాయుడి అవిటి కూతురి పెళ్ళి జరిగింది. టైఫాయిడ్ తో బతకడనుకొన్న కేశనాయ్— అమ్మవారికి మొక్కుకున్నాక బ్రతికి బయట పడ్డాడు. పెళ్ళిళ్ళు వ్రతాలు, నీలాలు అర్పించుకోవటం అన్నీ అక్కడే.

స్టేషను దగ్గరకొస్తుంటే మనసంతా ఉత్తేజంతో నిండి పోయింది. పుట్టి పెరిగిన ఊరు మరి. స్టేషనులో బండి ఆగటం నేను ఒక్క దూకులో ప్లాట్ ఫారం మీదకు దూకటం ఒకేసారి జరిగాయి. విస్సూ గాడు, నలపాయ్, అచ్యుతం స్టేషన్ కొచ్చారు. వాళ్ళు ఉదయమే వచ్చారంట. చిత్తూ ఇంకా రాలేదని వార్త. తను కూడా ఈ బండికే వస్తాడనుకొన్నారంట వాళ్ళు.

ఆ సాయంత్రం నలుగురం కలసి పొలం వైపు వెళ్ళాం. పచ్చని పైర్లని చూస్తూ..... చల్లని గాలి కౌగిలిలో ముచ్చట్లాడు కొంటున్నాం. ఇంతలో చైతన్య వచ్చాడని కబురు వచ్చింది. మాకు ఆశ్చర్యం వేసింది. ఇప్పుడు ట్రైను లేదు కదా ఎలా వచ్చాడని. బహుశా టాక్సీలో వచ్చాడేమో అనుకొని ఇంటి కొచ్చే సరికి—

విశ్వం పిల్లలతో ఆడుతున్నాడు చైతన్య. వాడు ఎవరితో కావాలనుకుంటే వాళ్ళతో కలువగలడు. వాడి భార్య నిత్య మహిళా మండలిలో చేరిపోయి వంట సారథ్యం వహిస్తోంది.

మమ్మల్ని చూసి ఆప్యాయంగా నవ్వాడు చైతన్య. వాడిలో ఏమి మార్పు లేదు. అదే చిరునవ్వు. ఎదుటి వాళ్ళ మనస్సుల్లోకి చూసే అదే చూపు.

"ఇప్పుడెలా వచ్చావురా" అన్నాడు విశ్వం ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ. "బస్సులో ప్రక్క వూరు దాకా వచ్చి అక్కడ్నుంచి పడవలో వచ్చాం" అన్నాడు.

"అంత శ్రమ ఏది పడవలేనా" అన్నాను నేను.

"అవునురా! నిత్యకి ఎప్పటి నుంచో పడవలో ప్రయాణం చేయాలని కోరిక. అందుకనే ఇలా వచ్చాం"! అన్నాడు.

మీరుఉన్నారు అన్నట్టు మా ఆడవాళ్ళు మా వంక కినుకగా చూసారు. ఆ రాత్రి భోజనాల తరువాత డాబా మీద పక్కలు పరుచుకొని తీరిగ్గా కబుర్లలో పడ్డాము.

చలపాయ్ తనకు ఇంకా పుట్టని పిల్లల గురించి దిగులు వెలిపుచ్చాడు.

విష్ణు వ్యవసాయంలో కష్ట సుఖాలు చెప్పాడు.

"ఏ కబుర్లు ఏమిటిరా చిత్తూ" అన్నాడు విశ్వం.

"నా సంగతులంటూ ప్రత్యేకం ఏమీ లేవు. నిత్యా నేను ఆఫీసుకు వెళ్ళటం. ఆఫీసు నుంచి వచ్చినాక పని ముగించుకొని పిల్లలతో పాటు సాహిత్యంతో కూడా కాలక్షేపం చెయ్యటం" అన్నాడు.

ఆ తరువాత స్వవిషయాల మీద నుంచి సంభాషణ జాతర్ల మీద సాగటంతో—

"ఏమిటో ఈ జాతర్లు! అమ్మవార్లు! మనిషి ఇంకా నమ్మకాల్లోంచి ఎప్పటికి బయట పడతాడో! అన్నాడు అమృతం.

"అట్లాంటి వాటి నుంచి బయటకురావటానికి మనస్సులో జ్ఞానం ఉండాలి."

"నాలెడ్జ్ ఈజ్ పవర్ ఫుల్" జ్ఞానం అన్నింటి కన్నా బలమైనది." అన్నాను నేను.

"ఏడిశావ్! 'అజ్ఞానం కన్నా జ్ఞానం బలమైనది కాదు' ఆ మాటకొస్తే అవసరం అంత పవర్ ఫుల్ ఏదీ కాదు." అన్నాడు చిత్తూ.

అందరికీ చిర్రెత్తింది. వీడికి చిన్న తనం నుండీ ఉన్న జబ్బు ఇది. మనం అవునంటే వాడు కాదనటం. ఇంకా వాగితే మనచేత కూడా కాదనిపించటం.

**** **** *****

జాతర జరిగే చోటికి వెళ్ళేసరికి అక్కడంతా కోలాహలంగా వుంది. ప్రభ బళ్ళు కట్టుకొని ప్రక్క వూళ్ళనుంచి కూడా చాలా మంది వచ్చారు. జాతర సందర్భంగా చాలా కొట్లు వెలిసాయి. గుడి లోపలికి ప్రవేశించే సరికి బాగా రద్దీగా వుంది. "సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్" అన్న సామెతని నిరూపించటానికి నడుం కట్టుకొన్న వాళ్ళలా

> 'ఆ సావిత్రి నా గురించి అందరితో అబద్ధాలు చెబుతోంది'
> 'బాధపడకు సామీ! నిజాలు చెప్పడం మొదలెడితే అప్పుడు చూద్దాం!'

నేను, విశ్వం జనాన్ని తోసుకొంటూ ముందుకు వెళ్ళాం. విశ్వం పలుకుబడితో మా కోసం స్పెషల్ పూజ ప్రారంభమయింది. భక్తితో కళ్ళు మూసుకొని నా కోరికల భారతం నివేదించబోతున్న నా భుజం మీద చైతన్య చెయ్యి పడింది.

'ఏమిటిరా' అన్నాను వాడి వైపు తిరిగి.

దేవతా విగ్రహం వంకే పరీక్షగా చూస్తున్న చైతన్య నా వేపు తిరిగి 'రఘూ ఆ విగ్రహాన్ని నువ్వు గుర్తు పట్టలేదా' అన్నాడు.

"గుర్తుపట్టడం ఏమిటిరా" అంటూ విగ్రహం వేపు తేరిపార చూసిన నేను షాక్ అయ్యాను. కంగారుగా చైతన్య వేపు చూసేసరికి అతనూ అదే స్థితిలో కనిపించాడు.

"ఈ విగ్రహం.... చెయ్యి లేని విగ్రహం.... అదేనా" అన్నాను. ఏదో సంశయంగా అవునన్నట్టు చిరునవ్వు నవ్వాడు. నా జ్ఞాపకాలు మేం పదో తరగతి చదువుకుంటున్న రోజుల నాటి దగ్గరకు వెళ్ళాయి.

*** *** ***

ఆ రోజుతో పరీక్షలు అయిపోవటంతో నేనూ, చైతన్య ఊరు మీద పడ్డాం. మా వూరు మండపం దగ్గర కొచ్చేసరికి అక్కడ పడుకొని నిద్రపోతున్న వ్యక్తిని చూసి మా కాళ్ళు అప్రయత్నంగా ఆగాయి. దానికి కారణం ఆ నిద్ర పోతున్న వ్యక్తే. ఆ వ్యక్తి నెల రోజుల క్రితం మా ఊళ్ళో ప్రవేశించి అందరిళ్ళల్లో దూరి పిచ్చి చేష్టలు చేస్తున్న పిచ్చి వాడు. మేం ఇద్దరం ఏదో నిర్ణయానికి వచ్చినట్లు మెల్లగా అడుగులు సవ్వడి కాకుండా ఆ పిచ్చి వాడి దగ్గరకు వెళ్ళి అతని ముఖంలోకి చూసాం. అతను గాఢ నిద్రలో ఉన్నాడు.

మా చూపులు అతని ప్రక్కనున్న గోనె సంచి మీద పడ్డాయి. ఇద్దరం సంచిని శోధించి పిచ్చాడి బట్టలతో పాటు ఓ పెద్ద బొమ్మని బయటకు తీసాం. ఆ బొమ్మని తన సంచిలో పెట్టుకొని ఎందుకు తిరుగుతున్నాడో అర్థం కాలేదు మాకు.

నేను చైతన్య కళ్ళతో సైగ చేసుకొని ఆ బొమ్మని తీసుకొని పొలాల వైపు పరుగు తీసాం. పొలం గట్టు మీద కూర్చొని ఆ బొమ్మని పరీక్షగా చూసాం. అది ఓ దేవుడి బొమ్మలాగా ఉంది. పిచ్చోడివల్ల బాధ పడ్డ కుటుంబాల్లో మా కుటుంబాలు వుండటంతో తెలిసీ తెలియని వయస్సు ఉక్రోషంతో బొమ్మ చేతిని కోపంతో విరికేసాం. ఇంకా కోపం తీరక దాన్ని తీసికెళ్ళి ప్రక్కనున్న పొలంలో నుయ్య కోసం తవ్వుతూ, నీళ్ళు పడలేదని వదిలేసిన గుంటలో పూడ్చిపెట్టాం.

తరువాత మెల్లగా ఆ సంఘటనే మర్చి పోయాం. అవునూ, ఈ పరిసరాల్లోనే ఆ బొమ్మని మేం పాతి పెట్టాం. ఆ పొలం చేతులు మారి రాయుడి చేతిలో పడి అతని హయాంలో బొమ్మ బయట పడటం మొగో, ఆడో అర్థంగాని ఆ బొమ్మని ఆడ బొమ్మగా భావించి, ఓ దేవతలా పూజించటం మొదలు పెట్టటంతో రాయుడి పొలానికి డిమాండు పెరిగి లక్షల్లో అమ్ముడు పోవటం ఆ డబ్బుతో కట్నం ఇచ్చి కూతురు పెళ్ళి చేయటం జరిగింది.

నేను ఆలోచనల నుంచి తేరుకొనే సరికి చైతన్య నావేపే చూస్తున్నాడు. నా పరిస్థితి ఇరుకున పడింది. ఇప్పుడు ఈ బొమ్మని పూజించాలా పూజించ కూడదా!— పూజిద్దామంటే ఎదురుగా చైతన్య. మా వాళ్ళు పూజ ముగించుకొని బయటకు నడుస్తున్నారు. వాళ్ళతో కదులుతున్నట్టే కదులుతూ చైతన్య బయటకెళ్ళాడని రూఢీ చేసుకొని గిరున వెనక్కి తిరిగి ఆ విగ్రహం దగ్గరకు నడిచాను. ఏ పుట్టలో ఏ పాముందో ఏ రాతిలో ఏ మహత్యముందో. ఈ విగ్రహానికి మహత్యం ఉంటే ఆగిపోయిన నా ప్రమోషన్ వస్తుందేమో అనుకుంటూ ప్రమోషన్ ప్రార్థన విన్పించి నీ దయతో ప్రమోషన్ వస్తే నీకు అర్చన చేయిస్తాను అని మొక్కుకొని బయటకు వచ్చేసరికి చైతన్య పిల్లలను రంగుల రాట్నం ఎక్కించే ప్రయత్నంలో ఉన్నాడు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు.

వాడి నవ్వులో "అజ్ఞానం అన్నిటి కన్నా బలమయినది" అన్న వాడి మాటలు స్ఫురించాయి.

ఈ సారి కూడా వాడి మాటలే నిజమయినందుకు ఉక్రోషంతో అక్కడ ఉండకుండా విష్ణు గాడి ఇంటి వైపు నడిచాను. ●

ఈ కొత్త రచయితల శీర్షికలో ఒక మంచి కథకు వారం వారం 116 రూపాయలు బహుమతిగా అందజేస్తాం

—ఎడిటర్